# పెళ్ళిచూపులు

కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు పుడతాడనే సామెత ఊరకే పుట్టలేదని అనుభవం చెప్పింది కమలాకర్‌కు. బియ్యే పాసవగానే ఎమ్మేలో సీటు తయార్. ఎమ్మే కాగానే ఉద్యోగం ఆర్డర్ వచ్చి అరచేతిలో వాలింది. కల నిజమాయేగా, కోరిక తీరెగా... పాట పాడుకుంటూ ఝుమ్మని ఉద్యోగంలో జాయినయ్యాడు.

అది భయమో, భక్తియోగాని ఆడపిల్లలంటే అదో రకమైన ఎలర్జీ ఉండేది కాలేజీలో. కాని... కార్యాలయములో కన్నెపిల్లల్తో కలిసి పంజేస్తుంటే థ్రిల్లింగ్‌గా ఉంది. మనస్సనే నందన వనములో కన్నెపిల్లల కొంగు గాలి మలయ మారుతంలా వీస్తూంది. లేడీ స్టెనో బాబ్డ్ హెయిర్ సవరించుకుంటూ నోట్స్ కోసం ముందు నుంచుంటే - ఆవిడ అందచందాలను అట్నుంచి ఇటూ - ఇట్నుంచి అటూ ఎగాదిగా చూడాలన్పిస్తుంది. అయినా డ్యూటీయే బ్యూటీగా భావించి నిలదొక్కుకుంటున్నాడు. ఎంత నిలదొక్కుకున్నా ఎన్ని ఇంక్రిమెంట్లు వచ్చినా తనలో తనకు ఏదో వెలితిగోచరిస్తూంది.

కోరవయసు, కోర్కెల గుఱ్ఱాల పరుగులు, కలల అలల ఆరాటం, ఇంకేదో కావాలనే పోరాటం... మనస్సనే కోతి ఒక్క చెట్టుమీద నిలవట్లేదు. అయిదారునెలల క్రితం...

"మా అన్నయ్య కూతురు మంజుల కుందనబ్బొమ్మలా తయారైం"దంటూ... అమ్మ ప్రస్తావిస్తే.

"పట్టుమని పదివేల రూపాయల కట్నమివ్వలేని నీ అన్నయ్య కూతుర్ని నా కొడుక్కు అంటగట్టాలనుకుంటున్నావేమో... అదేమీ కుదరదు" నాన్న కట్‌చేసి పారేశాడు.

"మా అన్నయ్యకు కాలం కలిసి రావట్లేదంతే. అయినా కూతుర్ని చక్కగా చదివించాడు. మంజుల ఇప్పుడు..."

"చాలు నీ సంబడం. గత పదేళ్ళ నుండి మనల నాదరించాడా ? వాడిప్పుడు ప్రయోజకుడైనాడని నీ అన్నయ్య ఉత్తరాలు కుమ్మరిస్తున్నాడు. నీ మీద ప్రేమ ఒలకబోస్తున్నాడు".

కమలాకర్ - మంజులలు చిన్నప్పుడు చేతిలో చేయ్యేసుకుని తిరిగారు. చెరువుగట్టున పిచ్చుక గూళ్ళు కట్టుకున్నారు. శివాలయంలో దాగుడు మూతలాడుకున్నారు. అవన్నీ ఇప్పుడు గుర్తుకొస్తే "ఊహు ! అవన్నీ చిన్ననాటి ఆటలు" అని కొట్టి పారేస్తాడు.

అడిగిన కట్నం బివ్వని
**మిడిమేలపు మామనడిగి, మిడుకట కంటెన్**
వడిగా ఉద్యోగమ్మున
సుడిగాలిగ చుట్టుకొచ్చి శూడనొాదున్...

ఆనందంగా ఓ కందం చెప్పుకుంటాడు.

అనుకున్నంత కట్నం ఆఫర్ వచ్చేదాకా ఆగాల్సిందేనని నాన్న కరాకండిగా చెప్పేశాడు గూడా.

ఇప్పుడు అమ్మ బలవంతమ్మీద పెళ్ళి చూపులకుద్యమించాడు.

ఆఫీసు నుండి నేరుగా బస్టాండు చేరుకున్నాడు. బస్సు రెడీగా ఉంది. ఎక్కేశాడు. సీట్లన్నీ నిండి పోయినై. కుడిపక్క టూ సీటర్లో మాత్రం చక్కని చుక్కలాంటి జవ్వని ఒక్కతే కూర్చునుంది. అక్కడికెళ్ళి చుక్కపక్క సీటు మీద బ్యాగు ఉంచాడు.

"మిస్టర్... అది లేడీస్ సీటు" లేడీ కండక్టర్ లేడిపిల్లలా పరుగెత్తుకొచ్చింది. ఓహో ! కండక్టర్ జాంపండులాగుందే !

"ఫరవాలేదు... కూచోనీండీ !" కళ్ళు కమ్మగా తిప్పేసిందా చుక్క. కండక్టర్ నవ్వేసి వెనక్కు మళ్ళింది. పెద్ద కుదుపుతో బస్సు బయలుదేరింది. నిలదొక్కుకోలేక చుక్క ఒడిలో పడిపోయాడు. తంతే బూరెల బుట్టలో పడ్డట్టనిపించింది.

"ఏయ్ మిస్టర్ ? వాటీజ్ దిస్ ?" సీట్లోకి తోసేసింది చుక్క. సారీ చెప్పి సర్దుక్కూచున్నాడు. చూపులు మాత్రం చుక్క మీదనే నిలిచిపోయినై. ఆపాదమస్తకం పరిశీలిస్తున్నై.

చెక్కిన ఒళ్ళు, చక్కని కళ్ళు, నున్నని చెక్కిళ్ళు, సన్నని నడుము, పొంగుకొచ్చి మొనదేలిన యౌవ్వనపు పొంగులు, నెలవంకలాంటి నుదురు మీది ముంగురులు కదలిక, ఇంద్రనీలాల మెరుపు లాగుంది. హబ్బ... బందరు లడ్డూలాగుంది. పెదాలు చప్పరించాడు.

బస్సులోని జనాలు కొందరు కబుర్లలో మునిగారు. మరికొందరు మత్తుగా జోగుతున్నారు. చుక్క చూపుల నాకట్టుకోవాలనే ఆరాటం కమలాకర్‌లో కలకలం రేపింది.

"ఏవండీ... మీరూ..." ధైర్యంగా భుజం తట్టాడు.

"ఆ ... ఏమిటీ ?' దబ్బున అతనివైపు తిరిగింది. కనుబొమ్మలు ప్రశ్నార్థకాలైపోయినై. ఏదో పశువు ఎదురొచ్చినట్టుంది... బస్సుకు షడన్‌బ్రేకులు పడిపోయినై. చుక్కచటుక్కున ముందుకు వాలిపోయింది. ఛాతికిఛాతీ రాసుకుంది. ఒళ్ళు జిల్లు మంది. అనుకోకుండా చేతులామెను చుట్టేశాయి. హబ్బ... ఎంత హాయి....

"వాట్ నాన్సెన్స్ ... !" గుర్రుమంది.

ఆమె అరిస్తే ప్రయాణీకులంతా ఒకటై తన పళ్ళూడగొడ్తారు. వీపు విమానం మోత మోగిస్తారు. వదిలేశాడు. జారినకొంగును జాగ్రత్తగా సర్దుకుంటుంది. పెదాలు తడైపోయినై. ఇప్పటి వరకు ఏ ఆడదాన్నీ అంత దగ్గరగా చూడలేదు. తాకడమనేది తటస్థించలేదు. బస్సు కుదుపులతో భుజాలు ఒరుసుకుంటున్నై. మత్తుగా ఉంది.

.... బస్సు బృందావనం ముందాగింది. తాను చుక్కతో బృందావనంలో ఆడుకుంటున్నాడు. నడుమ్మీద చెయ్యేసి యుగళగీతం పాడుకుంటున్నాడు. కౌగిలింతల్లో పరవశిస్తున్నారు. ముద్దులతో మురిసిపోతున్నారు....

బస్సు స్టేజీవద్ద ఆగింది. ఊహాలోకం హుష్కాకైంది.

"లక్ష్మీదేవిపల్లి... లక్ష్మీదేవిపల్లి..." ఆవులిస్తూ అరిచింది కండక్టర్. బ్యాగు అందుకుని గబగబా దిగేశాడు. అక్కడే... అతనికంటే ముందే దిగి నుంచుంది చుక్క.

ఎదురుచూస్తున్న ప్రేయసి కోసం పరుగెత్తుతున్న ప్రియుడిలా సూర్యుడు పడమటి విశ్రాంతి గృహానికెళ్తున్నాడు. ఆకాశంలో పక్షులు బారులు దీర్చి వెళుతున్నై.

సీతారాంపల్లి చేరాలంటే రెండు కిలోమీటర్లు నడిచి వెళ్ళాలని తెలుసు. నాలుగైదు ఊళ్ళకు అదొక్కటే బస్‌స్టాప్. ఏ దారిలో వెళ్ళాలో ఏమో... అర్థంగాలేదు.

ఇహ చుక్కనే దిక్కు.

"మీరు గూడా ఇక్కడనే దిగారా ?" అడిగాడు. ఎందుకైనా మంచిదని చిరునవ్వును పెదాలకతికించుకున్నాడు.

"లేదు... ఇంకా దిగలేదు. కలలుకంటూ కూచున్నాను." వెక్కిరిస్తూ బ్యాగు చంకనేసుకుంది. ఆ తర్వాత నవ్వింది. ఏమిటా పిచ్చిప్రశ్న అన్నట్టుగుందా నవ్వు.

"ఆహా... అది కాదండీ..." వెంట నడిచాడు.

"ఏది కాదండీ?" గిరుక్కున వెనుదిరిగింది. చెవుల మకర కుందనాల చెమక్కు, ముక్కు పుడక తళుక్కు... జడ ఛాతీమీది కొచ్చిపడింది. కొండ పాకుతున్న కోడెనాగులాగుందది.

"నేనూ... నేను సీతారాంపల్లి కెళ్ళాలి..." నసిగాడు.

"అయితే... ఏంటటా !"

"ఇక్కడ రిక్షాలుగానీ, బండ్లుగానీ..."

"ఏవీ దొరకవు."

"మరెలాగండీ. నేనా ఊరికెట్లా వెళ్ళాలి ?"

"వెళ్ళకండి. నాకేం..." బలహీన సూర్యకిరణాలు ఆవిడ ఎర్రని పెదాల మీదవాలి పరావర్తనం చెందినై.

"అదికాదండీ !" భయమేసింది. "కాస్త దారి చూపించండి... ప్లీజ్..." చేతులు పట్టుకున్నాడు.

"ఆ... ఆ... ఇదేం పనటా !" చేతులు దులిపి విడిపించుకుంది.

"నేనుగూడా సీతారాంపల్లికే వెళ్తున్నాను... రండి" అంది. ఆమె అడుగులో అడుగేసుకుంటూ నడుస్తున్నాడు.

సూర్యకిరణాలు మాయమైపోతున్నై. గాలి చల్లగా వీస్తోంది. రోడ్డు కిరుపక్కల వరుసగా నిల్చున్న చెట్లు తలలాడిస్తున్నై.

"సీతారాంపల్లిలో మీరెవరింటికెళ్ళాలండీ ?" అడిగింది.

ఉసూరుమంటున్న కమలాకర్‌లో ఉత్సాహం ఊపిరి పోసుకుంది.

"నేనాండీ... మా నగరేశం మావయ్యింటి కెళ్ళాలి" పక్కకొచ్చాడు చొరవగా. ఆమె రోపీన ఆగిపోయింది.

"ఎందుకూ... ఏదన్నా శుభకార్యమా ?" ఎగాదిగా చూసింది.

"శుభకార్యమంటే..." చెప్పాలా వద్దా అనే అనుమానంలో మునిగాడు మొదట. ఆ తర్వాత తేరుకుని "అలాంటిదే అనుకోండి" అనేశాడు.

పుసుక్కున నవ్వింది. కళ్ళల్లోకి చూసింది.

"అరెరే... కొత్త పెళ్ళికూతుర్లా సిగ్గుపడతారెందుకూ?" అడిగింది. మసక వెలుతురులో ఆవిడ మొహం పున్నమి చందమామలా కన్పించింది.

"నాకెందుకండీ సిగ్గు ?" గాంభీర్యం పులుముకున్నాడు. "పెళ్ళి చూపుల కెళ్తున్నానండీ, మా మావయ్య కూతురు మంజులను చూడాలి."

"మావయ్య కూతురుతో పె... పెళ్ళి చూపులా ?" గొల్లున నవ్వింది. సొట్టలు పడిన బుగ్గలు, ఎగిరిపడుతున్న వక్షస్థలం, గమ్మత్తుగా గంతులేస్తున్న జడ... దృశ్యం చూడముచ్చటగా ఉంది.

"బలేవారండీ... తప్పా ?" తానూ నవ్వాడు.

"మేన మరదలుతో పెళ్ళి చూపులేమిటండీ బాబూ :" అతని గదవకింద చెయ్యేసి ముఖం పైకి లేపి సూటిగా చూసింది. హఠాత్సంఘటనకి ఐసైపోయాడు. ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని ముద్దు బెట్టుకున్నాడు. చుక్క నవనాడులు జిల్లు మన్నై. చేతులు చటుక్కు లాక్కుంది

"మీకు పెళ్ళి కాలేదు గదా !" అడిగాడు.

కాలేదని తలూపి "ఎందుకూ నన్ను చేసుకుంటారా ?" అనేసింది. ఊహించని జవాబుకు తబ్బిబ్బై పోయాడు.

"అంత అదృష్టమా ?" గాల్లో తేలిపోయాడు.

మరో నాలుగడుగులు పడ్డాయో లేదో గాలి దుమారమందుకుంది. చెట్లు శివసత్తుల్లా ఊగుతున్నై. కొద్ది సేపటిదాకా ఒకరికొకరు కనబడలేదు. అలాగే నుంచుండి పోయారు. గాలి దుమారం శాంతించింది.

"అయ్యో... నా కన్ను... నా కన్నండీ..." కుడికన్నును ఎడమచేత్తో మూసుకుంది.

"ఏమైందడీ ?" గాబరాగా చెయ్యందుకున్నాడు.

"నలుసండీ... నలుసు. కంట్లో నలుసు పడింది. కాస్త ఊదండీ... ప్లీజ్..." మరింత చేరువైంది. కన్నుమీది చెయ్యి తొలగించి కనురెప్పలు తెరిపిస్తున్నాడు. ఆవిడ ఎత్తువంపులు గుండెలకు రాసుకుంటున్నై. ఎన్నడూ పొందని అనుభూతి.

"థాంక్సండీ !" కొంగులాగి కళ్ళద్దుకుంది. గాజుల సవ్వడి చెవుల కింపుగా వినబడింది. నరాల్లో సరికొత్త స్వరాలు.

ముందుకు నడుస్తున్నారు. త్రోవకు రెండు వైపులా ఏపుగా పెరిగిన మక్కచేను... పొడగాటి ఆకులు పొంకంగా కదులుతున్నై. మసక వెలుతురును మాయంజేస్తూ చీకటి తెరలు దిగుతున్నై. చేనులో కుక్క మొరిగింది. చుక్క లటిక్కున వాటేసుకుందతణ్ణి.

"నాకు భయంగా ఉందండీ..." చేతులు బిగుసుకు పోతున్నై. నరాల్లో విద్యుత్తు ప్రవహిస్తోంది. వెన్నుపూసలో సన్ననిదేదో పాకుతున్న అలజడి.

"ఎందుకండీ భయం ?" అడిగాడు.

"కుక్కంటే నాకు భయం."

ఆ భయమే గదా నాకింత హాయినిస్తుంది - అనుకున్నాడు. చేతులు చాచి నడుముకు చుట్టేసి పెదాలకోసం వెదుకుతున్నాడు. వెనక నుండి వెలుతురు ఫోకస్ చొచ్చుకొచ్చింది. గబుక్కున విడిపోయారు. ఓ స్కూటర్ వేగంగా వచ్చి ఊళ్ళోకి దూసుకెళ్ళింది. ఇద్దరూ నవ్వుకున్నారు.

ఊరొచ్చింది, వీధిలైట్లు వెలిగాయప్పుడే.

"మీ మావయ్యింటికి నేను తీసుకెళ్తా రండి" అంది.

"ఊహు ! మావయ్యింటికొద్దు. నేను మీ ఇంటికే వస్తా" అనేశాడు చిన్నపిల్లాడిలా.

"మరి మీ పెళ్ళి చూపులో !? నా వెంట రండి మీ మంజుల ఇంటికి" అంటూ చేతులందుకుని లాక్కెళ్ళింది. ఇంటిముందు వదిలేసింది.

ఇంట్లో కమలాకర్ అమ్మానాన్నలున్నారు.

"హమ్మయ్య... వచ్చావురా కమలా !" అమ్మ ఎదురొచ్చింది.

"ఆహా... వచ్చావా మంజులా !" అత్తయ్య వచ్చి చుక్క బ్యాగందుకుంది.

"రారా మేనల్లుడూ... మా మంజుల గౌనులు వేసుకున్నప్పుడు నువ్వు దాంతో ఆడుకున్నావు. మళ్ళీ ఎన్నాళ్ళ కొచ్చావురా !" నగరేశం మావయ్య మురిసిపోయాడు.

"అయితే... మంజులా, నువ్వూ కూడబలుక్కుని కలిసొచ్చారా ?" అడిగాడు నాన్న కంగారుగా.

"ఈ చుక్క నా మరదలు మంజులనా ?" ఆశ్చర్యానందాలతో ఉక్కిరి బిక్కిరయ్యాడు కమలాకర్. హమ్మ గడుగ్గాయ్... ఓ ఆట పట్టించావు గదూ అనుకున్నాడు.

మంజుల కిలకిలా నవ్వింది. ఆ నవ్వు నవపారిజాతాల జల్లులాగుంది.

"మంజులగ్గాడా ఉద్యోగం దొరికిందట్రా, ఈరోజే జాయినై వస్తుందటా..." చల్లని కబురందించింది అమ్మ.

"సర్సరే... త్వరగా తెమలండి పెళ్ళి చూపులకు" ఎప్పట్నుంచో కాఫీలు లాగిస్తూ ఎదురు చూస్తున్న పురోహితుడు పంచాంగం తెరిచాడు.

"మా పెళ్ళి చూపులైపోయినాయండీ" అన్నాడు కమలాకర్ - తేరుకుని. నగరేశం చూపులు మంజుల వైపు మళ్ళినై - ప్రశ్నార్థకంగా.

"అవున్నాన్నా..." మంజుల బుగ్గల నిండా సిగ్గులు అలుముకున్నై. "ఆయన బస్సెక్కేప్పుడే అనుమానమొచ్చింది. బ్యాగు మీద పేరు చూశాక బావేనని రూఢి అయింది. పక్కసీటులో

కూచోబెట్టుకుని పట్టుకొచ్చా" ఎరుపెక్కిన బుగ్గల్ని అరచేతుల్లో దాచేసుకుంది.

"మరైతే... బావంటే..." అప్యాయంగా తలనిమిరింది తల్లి.

"బావంటే నాకెంతో ఇష్టం. నేనంటే బావకు బోలెడంత ఇది..." అనేసి లోపలికి తుర్రుమంది.

"ఇంక నీ అన్నయ్య కట్నమిస్తాడా... నేను తీసుకుంటానా ?" భార్య చెవిలో గొణిగాడు కమలాకర్ తండ్రి.

"అమ్మాయి లక్షణంగా ఉంది. అదే లక్షల కట్నం. ఇంకా డబ్బు కట్నమెందుకండీ ? ముల్లె సంపాదించుకోవచ్చు గానీ పిల్లను చూడండీ..." పళ్ళు బిగపట్టి కళ్ళు తిప్పేసిందావిడ.

మరదలా... నా ముద్దుల మరదలా... అనుకుంటూ ఆగలేక లోపలికి పరుగెత్తాడు కమలాకర్.

"సరే... పెళ్ళికి మాంచి ముహూర్తం వెతికి... మళ్ళీ వస్తా...." నంటూ పంచాంగం మూసేసి, పంచ సర్దుకుంటూ వెళ్ళిపోయాడు పురోహితుడు.

•

**ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక, 24 మార్చి, 2000**